క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న అర్చకులు

హనుమంతునిపాడు: హనుమంతునిపాడులో రూ.60 లక్షలతో నిర్మించనున్న సీతారాముల ఆలయ నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. గ్రామానికి చెందిన గంటా వెంకటస్వామిరెడ్డి కుమారుడు గంటా సుబ్బారెడ్డి ఆలయ నిర్మాణానికి రూ.20 లక్షలు అందజేశారు. దీంతో గ్రామస్తులు దాతల సహకారంతో కలిసి ఆలయాన్ని నిర్మించేందుకు ముందుకు వచ్చారు. అర్చకుల వేదమంత్రాల నడుమ భూమిపూజ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు


పోలీసుల అదుపులో జూదరులు

పీసీపల్లి: మండల పరిధిలోని పెద్ద ఇర్లపాడు పంచాయతీ పరిధిలోని అన్నపురెడ్డిపల్లి గ్రామ శివారులో కోడిపందాలు ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 3 కోళ్లు, 7 బైక్‌లు, రూ.4,350 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని శుక్రవారం కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై జి.కోటయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీపీ దంతులూరి ప్రకాశం

కనిగిరి రూరల్: స్వయం సహాయక సంఘాల సభ్యులకు అధికారులు సకాలంలో రుణాలు ఇప్పించి వారి అభివృద్ధికి తోడ్పాటునివ్వాలని ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం మండల సమాఖ్య సభ్యులు, ఐకేపీ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రకాశం మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీ సభ్యులు ప్రభుత్వ రుణాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. పొదుపు గ్రూపులు బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించాలన్నారు. ఏపీఎం అంబేడ్కర్, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేస్తే తగిన గుర్తింపు


ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

హనుమంతునిపాడు: నిబద్ధతతో పనిచేస్తే తగిన గుర్తింపు వస్తుందని పాఠశాల హెచ్‌ఎం పద్మావతి అన్నారు. స్థానిక సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన షేక్ ఖలీమున్నీషాబేగంను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలకు రూ.10 వేల విలువైన కుర్చీలు అందజేశారు. ఉపాధ్యాయులు ఆమెను సన్మానించి అభినందనలు తెలిపారు. పాఠశాల ఎంఎంఎస్ చైర్మన్ సాని కొమ్ము వెంకటేశ్వరెడ్డి, పీడీ షేక్ జిలానీబాషా, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, శ్రీనివాసులు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు


వార్డులో పర్యటిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: మున్సిపల్ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని మూడో వార్డు, శంఖవరం తదితర ప్రాంతాల్లో గురువారం చైర్మన్ గఫార్, కమిషనర్ డానియల్ జోసఫ్ పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ జోసఫ్ మాట్లాడుతూ మున్సిపాలిటీ స్థలాలు, డ్రైనేజీలు ఆక్రమిస్తే చట్టప్రకారం చర్యలు ఉంటాయన్నారు. స్థానికులు చైర్మన్, కమిషనర్‌లను రోడ్డు, డ్రైనేజీ, పారిశుధ్యం సమస్యలను విన్నవించారు. తక్షణ సమస్యల పరిష్కారంకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. టీపీఎస్ సువర్ణకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్కే నాయబ్ రసూల్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కుబడిగా ముగించేశారు..!


కనిగిరి ఐసీడీఎస్ కార్యాలయం


తొలి రోజు కార్యాలయంలో పాల్గొన్న అధికారులు(ఫైల్)

- కనిగిరిలో బాలల హక్కుల వారోత్సవాల నిర్వహణ అంతంతమాత్రమే
- షెడ్యూల్ ఘనంగా.. ఆచరణ అధ్వాన్నంగా
- తొలి రోజు ఆర్భాటం.. చివరి రోజు ముక్తసరి
- అధికారుల లేమితో కొంత... నిర్లక్ష్యంతో మరి కొంత

కనిగిరి రూరల్:

బాలల హక్కుల వారోత్సవాలు కనిగిరి నియోజకవర్గంలోని రెండు ప్రాజెక్టుల పరిధిలో మొక్కుబడిగా సాగాయి. నియోజకవర్గంలోని కనిగిరి ప్రాజెక్టు పరిధిలో కనిగిరి, పామూరు, పీసీపల్లి మండలాల్లో 9 సెక్టార్లకు గాను 239 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వెలిగండ్ల ప్రాజెక్టు పరిధిలోని 9 సెక్టార్లలో 205 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అయితే సగం పైగా సెక్టార్ అధికారులు లేరు. ఇన్‌చార్జిలతో పాలన సాగుతుంది. దీంతో రెండు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అధికారులు లేమితో కొంత.. ఉన్న చోట్ల బాధ్యతా రాహిత్యంతో మరి కొంత వెరసి వారం రోజుల పాటు నిర్వహించాల్సిన కార్యక్రమాలను అధికారులు మమ అనిపించారు. కనీసం అంగన్ వాడీ కార్యకర్తలకు చాలా మంది అంగన్ వాడీ వారోత్సవాల షెడ్యూల్ గురించి కూడా తెలియదంటే అతిశయోక్తి కాదు.

లక్ష్యం ఇది..

బాలల హక్కులు, సామాజిక దురాచారాలు, బాల్య వివాహాలు, వాటి వల్ల ఎదురయ్యే దుష్ప్రభావాలు, లైంగిక వేధింపులు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, వంటి అనేక విషయాలపై బాలలకు, తల్లులకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలు. అందులో భాగంగా ఈనెల 14న చిల్డ్రన్స్ డే జరిపి బాలల హక్కులు, సామాజిక దురాచారాలు, బాల్య వివాహల నిర్మూలన, బాలల లైగింక వేధింపులు, బాల కార్మికులు నిర్మూలనపై మండల, గ్రామ స్థాయిల్లోని హైస్కూల్స్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. 15న బాలల హక్కులు, బాలల వివాహాల వల్ల ఎదురయ్యే దుష్ప్రభాలపై సాంస్కృతిక కార్యక్రమాలు, వక్తృత్వ పోటీలు, 17న యోగా ప్రాముఖ్యత, 18న ప్లాంటేషన్ డ్రైవ్, 19న దత్తత, సంరక్షణపై బహిరంగ ప్రదేశాల్లో సోషల్ మొబిలైజేషన్ డ్రైవ్, 20న లైన్ డిపార్ట్‌మెంట్స్‌తో కలిసి బాలల హక్కుల సంబరాలు, ర్యాలీలు చేయాల్సి ఉంది.

అన్ని చోట్లా అదే తంతు..

నియోజకవర్గంలోని కనిగిరి, వెలిగండ్ల ప్రాజెక్టుల్లోని ఆరు మండలాల్లో 80 శాతం కార్యక్రమాలు జరిగిన దాఖలాలు లేవంటే అతిశయోక్తి కాదు. తొలి రోజున కనిగిరిలో ఒకటి, రెండు హైస్కూల్స్‌లో లైన్ డిపార్ట్‌మెంట్స్‌తో కలిసి ఐసీడీఎస్ సీడీపీఓ, సూపర్‌వైజర్‌లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నామ్‌కే వాస్తే కొన్ని సెక్టార్లలో సూపర్‌వైజర్లు కార్యక్రమాలు నిర్వహించారు. అక్కడక్కడా పాఠశాలల్లో నిర్వహించిన వేడుకల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు కన్పించారు. మరికొన్ని సెంటర్లలో అంగన్‌వాడీలు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి బాలల దినోత్సవాన్ని ముగించారు. ఇక తర్వాత ఐదు రోజుల పాటు జరిగాల్సిన కార్యక్రమాలు ఎక్కడా నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు జరగలేదని ఆ శాఖలోనే గుస గుస లాడుకుంటున్నారు. చివరి రోజు దాదాపు 90శాతం ఎక్కడా సంబరాలు, ర్యాలీలు నిర్వహించలేదని తెలిసింది. మరీ విచిత్రం ఏమిటంటే బాలల హక్కుల వారోత్సవాల షెడ్యూల్ గురించి కొందరు అంగన్‌వాడీలకే సమాచారం తెలియదని తెలిసింది.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన కస్తూరిరెడ్డి


మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో కలిసి కనిగిరి జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కనిగిరిలో ప్రస్తుత పార్టీ పరిస్థితి గురించి వివరించారు. ఆయన వెంట పార్టీ మండల సేవాదళ్ అధ్యక్షుడు శ్రీహరిరెడ్డి, సంగటి మహేంద్రారెడ్డి, సైకం ఏడుకొండలురెడ్డి, మిట్టా రమేష్‌రెడ్డి, మహానందిరెడ్డి ఉన్నారు.
కనిగిరి రూరల్

హెల్మెట్‌తో ప్రాణానికి రక్ష

కొండపి: ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సీఐ సోమశేఖర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హెల్మెట్ వినియోగంపై ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా నిబంధనలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే ప్రమాదాలను నివారించగలమన్నారు. ఇటీవల కాలంలో యువకులు వాహనాలను వేగంగా నడిపి ప్రమాదాల బారిన పడుతున్నారని, ఇది తగదని సూచించారు. హెల్మెట్ ధరించకపోతే మోటార్ వెహికల్ చట్టం ప్రకారం జరిమానా విధిస్తామని హెచ్చరించారు అనంతరం వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్సై ప్రేమ్‌మార్, ఏఎస్సై అంకారావు, హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, స్థానిక పోలీస్ సిబ్బంది వాహనదారులు పాల్గొన్నారు


ద్విచక్రవాహనదారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ, ఎస్సై

ఉద్యాన పథకాలు రైతులకు అందేలా చూడాలి

పామూరు: ఉద్యానశాఖ ద్వారా అందిస్తున్న ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి రైతుకు అందేలా అధికారులు కృషిచేయాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి గోపీచంద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో గురువారం మండల ఉద్యానవన శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీహెచ్‌ఓ గోపీచంద్ మాట్లాడుతూ రబీ సీజన్‌లో మిర్చిసాగుచేస్తున్న రైతులందరూ ఈ క్రాప్ బుకింగ్‌తో పాటు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద రైతు వాటా ప్రీమియం చెల్లించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సందర్భంలో పంటలకు నష్టం వాటిల్లితే ఈ ఫసల్ బీమా పథకం రైతులను ఆదుకుంటుందని, రైతులు దీన్ని ఉపయోగించుకునేలా చూడాలని హెచ్‌ఓలకు సూచించారు. అనంతరం మండలంలోని వగ్గంపల్లెలో సాగులో ఉన్న మిరప పంటను పరిశీలించి రైతులకు తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. జిల్లాలోని మండల ఉద్యానవన అధికారులు పాల్గొన్నారు.


వగ్గంపల్లెలో మిరప పంటను పరిశీలిస్తున్న డీహెచ్‌ఓ గోపీచంద్

పెరటి తోటల పెంపకంపై దృష్టి సారించండి

సింగరాయకొండ: పెరటి తోటల ద్వారా పండ్లు, కూరగాయలు పెంచుకొని వాటిని ఆహారంగా తీసుకుంటే శరీరానికి పౌష్టికాహారం అంది ఆరోగ్యంగా ఉంటామని కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.నిహారిక సూచించారు. మండలంలోని బింగినపల్లి పంచాయతీ మక్కెపాలెం, కలికవాయ పంచాయతీలోని రెడ్డిపాలెంలలో గురువారం పెరటి తోటల పెంపకంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. డాక్టర్ నిహారిక మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రోజుకు 100 గ్రాముల పండ్లు, 400 గ్రాముల కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవాలని, అప్పుడే జీర్ణశక్తి పెరిగి గుండెజబ్బులు, కీళ్ల నొప్పులు, మధుమేహం, క్యాన్సర్ వంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చని సూచించారు. పురుగు మందులు వాడకుండా సేంద్రీయ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు ఏ విధంగా పండించుకోవచ్చో ప్రకృతి వ్యవసాయ అధికారి వెంకటరమణ ప్రజలకు వివరించారు. పండ్లు, కూరగాయల మొక్కలు, విత్తనాలను ప్రజలకు పంపిణీ చేశారు. సుమతి, సుహాసిని, గ్రామస్తులు పాల్గొన్నారు.


మొక్కలు, విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం


కొండపి: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సోమశేఖర్



పామూరులో అవగాహన ర్యాలీ

కొండపి: సోషల్ మీడియా ఎంత మంచిదో అంత ప్రమాదకరమని సీఐ సోమశేఖర్ అన్నారు. స్థానిక హ్యాపీ కిడ్స్ హైస్కూలులో గురువారం సోషల్ మీడియాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం చూపిస్తుందని, సోషల్ మీడియాలో మంచిని మాత్రమే విద్యార్థులు తీసుకోవాలని సూచించారు. మానవ జీవితంపై నేటి కాలంలో సోషల్ మీడియా ఎంతో ప్రభావితం చేస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్పై అవగాహన కలిగి ఉండాలని, వాహనాలు నడిపే వారు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. ఎస్సై ప్రేమ్‌కుమార్, కరస్పాండెంట్ అపర్ణ, ప్రిన్సిపాల్ శోభాదేవి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పామూరు: విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కిషోర్‌బాబు అన్నారు. స్థానిక చైతన్య హైస్కూల్‌లో గురువారం సైబర్‌నేరాలు, సోషల్‌మీడియాపై అవగాహన కల్పించారు. ఎస్సై కిషోర్‌బాబు మాట్లాడుతూ సోషలమీడియాల్లో పోస్టింగులు పెట్టవద్దని, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. పాఠశాల హెచ్‌ఎం జిలానీబాష, కాకొల్లు వెంకటరత్నం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): విద్యార్థులు సైబర్‌నేరాలు, సోషల్‌మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ ఎం భీమానాయక్ అన్నారు. మండలంలోని శీలంవారిపల్లె కదిరి బాబూరావు వ్యవసాయ, ఉద్యానవన కళాశాలల్లో గురువారం ఎస్సై ఆర్.సుమన్ అధ్యక్షతన సైబర్‌నేరాలు, సోషల్‌మీడియా, గంజాయి, డ్రగ్స్, మహిళలు, బాలికలపై నేరాలు అప్రమత్తతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు సోషల్‌మీడియాల్లో పోస్టింగులకు దూరంగా ఉండాలన్నారు. ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తుపదార్థాలు ఉన్నట్లు, విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కళాశాల డీన్‌లు డాక్టర్ పి.రఘుపతి, డాక్టర్ పి.వీరన్నగౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టంగుటూరు: స్థానిక ప్రభుత్వ, గురుకుల పాఠశాలల్లో సైబర్ నేరాలు, లైంగిక దాడులు, రోడ్డు ప్రమాదాలు, మాదక ద్రవ్యాలపై ఎస్సై నాగమల్లీశ్వరరావు అవగాహనకల్పించారు. మాదక ద్రవ్యాలతో యువత జీవితం నాశనమవుతుందన్నారు. అనంతరం టంగుటూరు సెంటర్‌లో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. డ్రైవర్లు విధిగా లైసెన్సు కలిగి, అధిక లోడుతో ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు.

పీసీపల్లి: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్సై జి.కోటయ్య అన్నారు. మండల పరిధిలోని గుంటుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలన్నారు. హెచ్‌ఎం పోతులూరయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కోటయ్య


మాట్లాడుతున్న సీఐ భీమానాయక్


టంగుటూరులో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై

వెలిగొండ ప్రాజెక్టు బడ్జెట్ సవరించాలి


మాట్లాడుతున్న సయ్యద్ అనీఫ్

హనుమంతునిపాడు: పశ్చిమ ప్రకాశం ప్రజల ఆశాజ్యోతి పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ ఏమాత్రం సరిపోదని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఆలీఫ్ అన్నారు. సీపీఎం మండల సమావేశం గురువారం నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ బడ్జెట్‌ను సవరించి వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ సిబ్బంది జీతబత్యాలకు పెండింగ్ బిల్లులకు మాత్రమే సరిపోతాయన్నారు. ఇలా చేస్తే 10 ఏళ్లకు కూడా వెలిగొండ ప్రాజెక్టు పూర్తయ్యే పరిస్థితి కనించడం లేదన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు, మండల నాయకులు మహేష్, ఏబు, ఏలియా, వెలుగొండయ్య, రాములు, వినయ్ , రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

సింగరాయకొండ: మండలంలోని సోమరాజుపల్లి ఎస్సీ కాలనీలో గురువారం రాత్రి 10 గంటల సమయంలో పేకాట శిబిరంపై ఎస్సై బి.మహేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1720 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్సై మహేంద్ర వివరించారు.

భైరవకోనలో ప్రత్యేక పూజలు


భైరవకోనలో పూజల్లో నాట్స్ అధ్యక్షుడు పి.మదన్‌మోహన్, నాయికులు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం భైరవకోనను మండలంలోని కోవిలంపాడు గ్రామవాసిఅయిన నాట్స్ (నార్త్ అమెరికా తెలుగు సొసైటీ) అధ్యక్షుడు పి.మదన్‌మోహన్ స్థానికులతో కలిసి గురువారం భైరవకోన పుణ్యక్షేత్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా త్రిముఖదుర్గాదేవి, కాలభైరవ, భర్గులేశ్వర, నగరేశ్వర ఆలయాల్లో పూజలు నిర్వహించి జలపాతాన్ని సందర్శించారు.

దుకాణదారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ భీమానాయక్

పామూరు: భద్రత దృష్ట్యా, దుకాణాల వద్ద చోరీలు జరగకుండా ముందస్తు జాగ్రత్తల కోసం వ్యాపారులు దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ ఎం భీమానాయక్ అన్నారు. స్థానిక సర్కిల్‌కార్యాలయం ఆవణలో గురువారం సాయంత్రం ఎస్సై కిషోర్‌బాబు అధ్యక్షతన వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి దుకాణాలకు అవసరాల నిమిత్తం వస్తువులు కొనుగోలు, అమ్మకాల కోసం వస్తుంటారని, ఈ సందర్భంలో గానీ లేదా రాత్రిళ్ల గానీ చోరీలు జరగకుండా తగు జాగ్రత్తల కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా ఖాదర్‌బాషా

పామూరు: సీపీఎం మండల కార్యదర్శిగా పామూరుకు చెందిన షేక్.ఖాదర్‌బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు గురువారం సీపీఎం కార్యాలయంలో పార్టీ మండల కమిటీ నూతన ఎన్నిక జరిగింది. మండల కార్యదర్శిగా షేక్.ఖాదర్‌బాషా, కార్యదర్శివర్గ సభ్యులుగా కె.మాల్యాద్రి, కే.శంకర్, సయ్యద్‌గౌస్‌బాషా, బి.నాగేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

స్వర్ణోత్సవాలను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న శాఖ మండల అధ్యక్షుడు వెంకట్రామయ్య

సీఎస్‌పురం(పామూరు): ఒంగోలులో ఈ నెల 24, 25 తేదీల్లో తలపెట్టిన యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకట్రామయ్య, షేక్.పాదుషా అన్నారు. స్థానిక పాఠశాలలో గురువారం సాయంత్రం జరిగిన యూటీఎఫ్ సబ్‌కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ పాఠశాల కాలనిర్ణయ పట్టిక మార్పులో విద్యాశాఖ పునరాలోచన చేయాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు ఉన్నత పాఠశాలలకు హాజరవుతున్నారని, సమయ మార్పుతో విద్యార్థినులు ఇబ్బందులు పడే అవకాశ ముందన్నారు. ఎన్.తిరుపతయ్య, వి.సాంబశివరావు, ఎం శ్రీనివాసులు, జి.రవిబాబు పలువురు పాల్గొన్నారు.

చక్కటి విద్యాబోధన చేయాలి

సీఎస్‌పురం(పామూరు): అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే ప్రీస్కూల్ పిల్లలకు అంగన్‌వాడీ టీచర్లు సులభతర పద్ధతిలో చక్కటి విద్యాబోధన చేయాలని సీడీపీఓ పి.సరోజిని అన్నారు. మండలంలోని పెదగోగులపల్లె ఎస్సీ అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె కేంద్రంలోని రికార్డులను పరిశీలించి కేంద్రంలోని పౌష్టికాహార నిల్వలను పరిశీలించారు. సీడీపీఓ కేంద్రానికి వచ్చిన గర్భిణులు, బాలింతలతో మాట్లాడుతూ పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా అని విచారించారు. పౌష్టికాహారం పంపిణీ సమయపాలన పాటించాలని, కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ గంధం సామ్యూల్, కార్యకర్తలు ఉన్నారు.

బంగారు బాల్యం విజేతలకు అభినందన


విద్యార్థులను సత్కరిస్తున్న అధికారులు

కొండపి: జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు గురువారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు సురేఖ, రామారావు మాట్లాడుతూ బంగారు బాల్యం వారోత్సవాల్లో భాగంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో మండలంలోని కొండపి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన జె.సిరివల్లి డ్రాయింగ్ పోటీలలో జిల్లా ద్వితీయస్థానం సాధించిందని తెలిపారు. అదే విధంగా కొండపి బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో డి.నిశిష చిత్రలేఖనంలోద్వితీయస్థానం సాధించినట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభకబరిచిన విద్యార్థులను అభినందించి సత్కరించారు. తహసీల్దార్ పి.మురళి, ఎంపీడీఓ రామాంజనేయులు, ప్రిన్సిపాల్ అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.